# జలాశయాల్లో మత్స్యసిరి



- జోరుగా చేప పిల్లల విడుదల
- నిజామాబాద్‌లో 1018 చెరువుల గుర్తింపు
- 4 కోట్ల 72లక్షల చేప పిల్లల విడుదలకు చర్యలు
- సర్కారు ప్రోత్సాహంపై మత్స్యకారుల ఆనందం
- కామారెడ్డిలో 2కోట్ల 78లక్షల చేప పిల్లల టార్గెట్

నిజామాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : భారీ వర్షాలతో తటాకాల్లో జల సంపద సమృద్ధిగా ఉండడంతో మత్స్య సంపదను భారీగా పెంపొందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నది. కొన్నేండ్లుగా తెలంగాణ సర్కారు చేస్తున్న ఈ ప్రయత్నంలో గ్రామాల్లో మత్స్య సంపద భారీగా పెరుగుతున్నది. దీంతో పాటు మత్స్యకారుల కుటుంబాలకు సైతం వెన్నుదన్ను లభిస్తున్నది. రూపాయి ఖర్చు లేకుండానే ప్రభుత్వమే పూర్తి రాయితీతో చేప పిల్లలను విడుదల చేస్తుండడంతో ఆ వర్గమంతా ఆనందం వ్యక్తం చేస్తున్నది. ఇందులో భాగంగా 2023–24 సంవత్సరానికిగాను ఇప్పటికే నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో చేప పిల్లల పంపిణీ ప్రారంభమైంది. అధికారికంగా ఈ కార్యక్రమాన్ని కామారెడ్డి జిల్లాలో స్పీకర్ పోచారం శ్రీనివాస రెడ్డి, నిజామాబాద్‌లో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ప్రారంభించగా అన్ని నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేలు జోరుగా చేప పిల్లలను జలాశయాల్లో వదులుతున్నారు. నిర్ణీత పరిమాణంలో గల చేప పిల్లలను వదిలేందుకు ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నది. నాణ్యతకు పెద్ద పీట వేయడంతో పాటు ఈ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా చేపట్టేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. మత్స్య సహకార సంఘాల ఆధ్వర్యంలోనే ఈ ప్రక్రియను చేపడుతున్నారు.

**సర్కారు వెన్నుదన్నుగా...**

మత్స్యకారులు ఒక్క రూపాయి పెట్టుబడి పెట్టకుండానే చేపలను సరఫరా చేసేందుకు ప్రభుత్వం చాలా రోజులుగా ప్రయత్నిస్తోంది. సీఎం కేసీఆర్ ఆలోచనలో భాగంగా చెరువులు, కుంటలు, భారీ నీటి పారుదల ప్రాజెక్టుల్లో చేప పిల్లల పెంపకానికి మత్స్యకారులను ప్రోత్సహిస్తున్నారు. 100 శాతం రాయితీతో చేప విత్తనాన్ని అందించడం ద్వారా వారికి కొండంత భరోసాతో పాటు వారి కుటుంబాలకు వెన్నుదన్నుగా కేసీఆర్ నిలుస్తున్నారు. గతంలో కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాల్లో వీరిని పట్టించుకున్నవారే కరువు. కనీసం రాయితీతో చేప పిల్లలను అందించకపోవడంతో పాటు చెరువులపై అజమాయిషీ చేసేందుకు సైతం మత్స్యకారులను అవకాశం లేకపోయేది. 2023 వానాకాలం ప్రారంభం నుంచి దంచి కొట్టిన వానలతో చెరువులన్నీ నీటి నిల్వతో తొణికిసలాడుతుండడంతో చేప పిల్లలను వదిలేందుకు ప్రభుత్వం మరోమారు నిశ్చయించింది. ప్రభుత్వమే ఉచితంగా చేప విత్తనాన్ని నేరుగా చెరువుల్లో వదులుతుండడంతో వచ్చే ఆదాయాన్ని ఆయా గ్రామాల్లోని మత్స్యకార కుటుంబాలకే దక్కుతోంది.

**ఉమ్మడి జిల్లాలో ఏడున్నర కోట్ల చేప పిల్లలు లక్ష్యం...**

గతేడాది 2022–23లో నిజామాబాద్ జిల్లాలో 1043 జలాశయాల్లో 4కోట్ల 85 లక్షల చేప పిల్లలు వదిలేందుకు లక్ష్యంగా పెట్టుకుని విజయవంతంగా ప్రక్రియను పూర్తి చేశారు. 2023–24 సంవత్సరంలో 1018 చెరువుల్లో 4కోట్ల 72లక్షల చేప పిల్లలను వదిలేందుకు టార్గెట్ పెట్టుకున్నారు. మరోవైపు రొయ్యల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. నిజామాబాద్ జిల్లాలోని 24చెరువుల్లో ఈసారి 90.25లక్షల రొయ్యలను వదిలేందుకు ఏర్పాట్లు చేశారు. ఇక కామారెడ్డి జిల్లాలో గతేడాది 627 చెరువుల్లో 2కోట్ల 70లక్షల చేప పిల్లలను వదిలారు. 2023–24 సంవత్సరానికి కామారెడ్డి జిల్లాలో 697 చెరువుల్లో 2కోట్ల 78లక్షల 60వేల చేప పిల్లలను వదిలేందుకు నిర్ణయించారు. గతేడాదితో పోలిస్తే కామారెడ్డి జిల్లాలో చెరువుల సంఖ్యను పెంచారు. ఏటా చేప పిల్లలను వదిలే ప్రక్రియలో విత్తనం సరఫరా చేసే కాంట్రాక్టర్లతో మత్స్య శాఖ అధికారులు కుమ్మక్కు అవుతుండడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. జలాశయాల్లో హడావుడిగా చేప పిల్లలను వదలడం ద్వారా లెక్కాపత్రానికి జవాబు లభించడం లేదు. దీంతో కొంత మంది అక్రమార్కుల భరతం పట్టేందుకు ప్రభుత్వం గతంలో మాదిరిగానే ఈ సంవత్సరం కూడా పకడ్బందీగా వ్యవహరిస్తోంది. చేప పిల్లల సైజులను తప్పనిసరిగా నిబంధనలు పాటించే విధంగా ఆదేశాలు జారీ చేసింది. చెరువుల్లో చేప పిల్లలను వదిలే సమయంలో స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, మత్స్య సహకార సొసైటీ బాధ్యుల సమక్షంలో సైజులు, చేప పిల్లల నాణ్యతను నిర్ధారించిన తర్వాత మాత్రమే చెరువుల్లోకి వదిలి పెట్టేలా మత్స్య శాఖ ఆదేశాలు ఇవ్వడంతో ప్రక్రియ అంతా మత్స్యకారుల సమక్షంలోనే జరుగుతోంది.

### చేప పిల్లల విడుదల ప్రారంభమైంది

ఇప్పటికే గుర్తించిన చెరువుల్లో చేప పిల్లలను వదిలే ప్రక్రియ ప్రారంభమైంది. ఆయా జలాశయాల్లో లక్ష్యానికి అనుగుణంగా చేప పిల్లలను సరఫరా చేసి స్థానిక ప్రజా ప్రతినిధులు, మత్స్యకారుల సమక్షంలో కార్యక్రమాన్ని చేపడుతున్నాము. కామారెడ్డి జిల్లాలో ఈసారి 60 చెరువులు అదనంగా చేర్చాము. 697 చెరువుల్లో 2కోట్ల 78లక్షల చేప పిల్లలను వదిలేందుకు ఏర్పాట్లు చేశాము. ఇందులో నిజాంసాగర్, కౌలాస్ ప్రాజెక్టులు కూడా ఉన్నాయి. చెరువుల్లో నీటి నిల్వ ఆశించిన మేర ఉండటంతో చేపల పెంపకానికి అనువైన వాతావరణం ఏర్పడింది.

**- వరదా రెడ్డి, మత్స్య శాఖ అధికారి, కామారెడ్డి జిల్లా**

## యాదాద్రికి తరలిన ఆర్మూర్ వాసులు




జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

ఆర్మూర్, అక్టోబర్ 8: ఆర్మూర్ పట్టణంలోని హౌసింగ్‌బోర్డ్ కాలనీ పార్క్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం యదగిరి గుట్టకు తరలివెళ్లారు. ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సొంత ఖర్చులతో బస్సులను ఏర్పాటు చేయగా వాకర్స్ అసోసియేషన్ సభ్యులు వారి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. ముందుగా ఆర్మూర్ నవనథ సిద్దులగుట్టపై రామాలయం, శివాలయంలో దర్శనాలు చేసుకొని అక్కడే అల్పాహారం చేశారు. అనంతరం జీవన్‌రెడ్డి బస్సుకు జెండాను ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వరలక్ష్మిలింబద్రిగౌడ్, సీనియర్ నాయకులు పోలసుధాకర్, నాయిని భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలు

**చిన్నారికి తప్పిన ప్రమాదం**

ధర్పల్లి, అక్టోబర్ 8 : మండల కేంద్రంలోని దమ్మన్నపేట్ రోడ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, ధర్పల్లి ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. దమ్మన్నపేట్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ దంపతులు పుప్పాల పద్మ–మహేందర్, మనుమరాలితో బైక్‌పై ఆదివారం మధ్యాహ్నం ధర్పల్లికి వస్తుండగా ధర్పల్లిలో ప్యాసింజర్లను ఎక్కించుకుని దుబ్బాక వెళ్తున్న ఆటో మూలమలుపు వద్ద ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ప్రమాదంలో మహేందర్, పద్మలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు హుటాహుటిన దంపతులిద్దరిని 108 అంబులెన్స్‌లో జిల్లా కేంద్ర దవాఖానకు తరలించారు. వారి వెంట ఉన్న చిన్నారికి ఎలాంటి గాయాలు కాలేదు. ఆటో డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాధితుల నుంచి ఫిర్యాదు తీసుకుని దర్యాప్తు చేస్తామని ఎస్సై ఈ సందర్భంగా తెలిపారు.

## విద్యుదాఘాతంతో ఆపరేటర్ మృతి



నాగరాజు(ఫైల్)

తాడ్వాయి, అక్టోబర్ 8 : మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా పని చేస్తున్న దుడుకుల నాగరాజు(35) ఆదివారం విద్యుదాఘాతంతో మృత్యువాతపడ్డాడు. ఎస్సై ఆంజనేయులు తెలిపి మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని దేమికలాన్ రోడ్డులో ఉన్న 33/11 సబ్‌స్టేషన్‌లో భిక్కనూర్‌కు చెందిన నాగరాజు ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ట్రాన్స్‌ఫార్మర్‌పైన ఫీజ్ పెట్టడానికి నిచ్చెన తీసుకొని వస్తుండగా అదుపుతప్పి పక్కనే ఉన్న 33/11 విద్యుత్ సరఫరా వచ్చే కరెంట్ వైర్‌కు నిచ్చెన తగిలింది. విద్యుత్‌షాక్ కొట్టడంతో నాగరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య భాగ్యలక్ష్మి, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నాడు.

## జోన్ -2 పరిధిలో నలుగురు ఎస్సైల బదిలీలు

**ఉత్తర్వులు జారీ చేసిన డీఐజీ వి.సత్యనారాయణ**

నిజామాబాద్‌క్రైం, అక్టోబర్ 8 : బాసర జోన్–2 పరిధిలోని మూడు జిల్లాల్లో నలుగురు ఎస్సైలను బదిలీ చేస్తున్న జోన్–2 డీఐజీ వి.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల జిల్లాల్లో విధులు నిర్వర్తిస్తున్న సివిల్ సబ్ ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం కల్పించారు. అయితే నలుగురు ఎస్సైల బదిలీలో నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలోని మోపాల్ పోలీస్ స్టేషన్‌లోవిధులు నిర్వర్తిస్తున్న ఎస్సై ఎల్.రామును మాత్రం మూడు నెలల్లోపే బదిలీ చేయడం చర్చనీయాంశంగా మారింది. మోపాల్ ఎస్సైగా ఉన్న ఆయనను నిజామాబాద్ సీసీఎస్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. ఆయన స్థానంలో నిర్మల్ జిల్లా వీఆర్‌లో అటాచ్డ్ ఎస్సైగా ఉన్న ఎం.గంగాధర్‌ను నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలోని మోపాల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌హెచ్‌వోగా పోస్టింగ్ ఇచ్చారు. జగిత్యాల జిల్లా, మెట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్సై–2 గా విధులు నిర్వర్తిస్తున్న టి.శ్యాంకుమార్ నిజామాబాద్ కమిషనరేట్ పీసీఆర్(పోలీస్ కంట్రోల్ రూమ్)లో పోస్టింగ్ ఇచ్చారు. నిర్మల్ జిల్లా డీసీఆర్‌బీ(డిస్ట్రిక్ట్ క్రైమ్ రికార్డ్ బ్యూరో)లో ఎస్సైగా కొనసాగుతున్న జి.చాందయ్యను నిజామాబాద్ కమిషనరేట్ సీఎస్‌బీ(స్పెషల్ బ్రాంచ్)విభాగంలో అటాచ్డ్ ఎస్సైగా పోస్టింగ్ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## భీమేశ్వరాలయాన్ని సందర్శించిన ఫ్రాన్స్ విద్యార్థులు

తాడ్వాయి, అక్టోబర్ 8 : మండలంలోని సంతాయిపేట భీమేశ్వరాలయాన్ని ఆదివారం ఫ్రాన్స్ విద్యార్థుల బృందం సందర్శించి ఆలయ విశిష్టతను తెలుసుకున్నది. ఫ్రాన్స్‌లోని ఎస్‌టీ గాబ్రియెల్ కాలేజీకి చెందిన 40 మంది విద్యార్థులు గ్రామీణ వాతావరణాన్ని తెలుసుకోవడంలో భాగంగా తాడ్వాయి పోలీస్ స్టేషన్, చిట్యాలలో గ్రామస్తుల అలవాట్లను అడిగి తెలుసుకున్నారు. భీమేశ్వరాలయంలో పూజలు చేశారు. అనంతరం అక్కడే వంటలు చేసుకొని భోజనాలు చేసి ఆటపాటలతో సందడిగా గడిపారు. తాడ్వాయి పోలీస్ స్టేషన్‌లో పోలీసుల విధులను అడిగి తెలుసుకున్నారు. ఎస్సై ఆంజనేయులు విద్యార్థులకు పోలీసుల విధుల గురించి వివరించారు. కార్యక్రమంలో చిట్యాల, సంతాయిపేట సర్పంచులు కవిత,భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఫ్రాన్స్ విద్యార్థులు

## ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొని ఒకరి దుర్మరణం

బాల్కొండ, అక్టోబర్ 8: బాల్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆగి ఉన్న లారీని పాలప్యాకెట్లతో వెళ్తున్న ఆటో వెనుక నుంచి ఢీకొనడంతో పెర్కిట్‌కు చెందిన ఆటో డ్రైవర్ కొత్త నాగరాజు (32) మృతి చెందాడు. ఏఎస్సై శంకర్ తెలిపిన మేరకు వివరాలు ఇలాఉన్నాయి. ఆదివారం ఉదయం 5 గంటలకు పెర్కిట్ నుంచి బాల్కొండకు పాల ప్యాకెట్లు సప్లయ్ చేసే ఆటో వెళ్తోంది. 44వ నంబర్ జాతీయ రహదారిపై రొడ్ల లింగయ్య ఆలయ కమాన్ వద్ద ఆగి ఉన్న ఐచర్ వాహనాన్ని ఆటో ఢీకొట్టింది. ఆటో డ్రైవర్ అక్కకక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య గంగాజమున ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

## అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

ఆర్మూర్, అక్టోబర్8: పట్టణంలోని రంగాచారి నగర్ కాలనీలో సిద్దాపురం పాపన్న(46) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలోమృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. రంగాచారి నగర్‌కు చెందిన పాపన్న తన ఇంటికి కొంత దూరంలో శనివారం రాత్రి సమయంలో అనుమానాస్పద స్థితితో మృతి చెందాడు. ఆదివారం ఉదయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించా రు. ఘటనా స్థలాన్ని ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సురేశ్‌బాబు, క్లూస్‌టీం సభ్యు లు వెళ్లి పరిశీలించారు. మృతదేహంపై గాయాలు ఉన్నాయని ఎస్‌హెచ్‌వో తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. మృతుడికి భార్య భూదేవి, పిల్లలు ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

★హైదరాబాద్, హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట్, కొహెడ, జనచైతన్య, బాటసింగారం శ్రీమిత్రలో ప్లాట్లు కొనబడును/ అమ్మబడును, నో Brokers.
Ph: 9666912111, 7995005999.
NT-320501

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.